# శవానికి క్షవరం

• సి. రవీంద్రనాథ్ •

**పోస్ట్ మాన్ బిక్క మొహం వేసుకుని మరోసారి బార్బర్ షాపులో కూర్చున్నాడు.**

బార్బర్ షేవింగ్ ప్రారంభించాడు.

షేవింగ్ ఒక్కటే కాదు అతని ప్రత్యేకత. షేవ్ చేస్తూ చిత్ర విచిత్రమైన విషయాలు చెపుతూ వుంటాడు.

"మా అన్నయ్యనెవ్వుడైనా చూశారా మీరు?" ప్రశ్నించాడు.

లేదన్నట్టుగా అడ్డంగా తల వూపాడు పోస్టమాన్.

"చాలా మంచి బార్బరు. నా షాపులో మా అన్నయ్యకి కూడా ఓ కుర్చీ వుండేది. అయనతో షేవింగ్, హెయిర్ కటింగ్ చేయించుకోవడానికి జనం తండోపతండాలుగా వచ్చేవారు.

"అయితే మీకో విషయం తెలుసా?" షేవింగ్ ఆపి అడిగాడు బార్బర్.

తెలియదన్నట్టుగా తల అడ్డంగా వూపాడు పోస్ట్‌మాన్.

"అన్నయ్య ఎప్పుడూ తాగి వుండేవాడు. పొద్దున్నే షాపుకి వచ్చేటప్పుడే తాగి వచ్చేవాడు. మధ్య మధ్య బయటికి వెళ్ళి మళ్ళీ తాగి వచ్చేవాడు. ఇలా సాయంకాలం వరకూ తాగుతూనే వుండేవాడు. అయినా ఆశ్చర్యం, తాగని నా దగ్గరకన్నా తాగిన అన్నయ్య దగ్గరే జనం ఎక్కువగా వుండేవారు."



జనం రాను రాను పెరగసాగారు. బయటి కెళ్ళి తాగడానికి టైం దొరకేది కాదు. అందువల్ల షాపులోనే లోపలి గదిలో ఓ బాటిల్ పెట్టుకున్నాడు. మధ్య మధ్యలోపలికెళ్ళిరెండు పెగ్గులు లాగించేవాడు. అన్నయ్య క్షవరం చేస్తే చేయించుకున్న వాడికి అదో రకమైన మత్తు వచ్చేది. ఎందుకంటే ఎప్పుడూ ఫుల్‌గా విస్కీ తాగి వుండేవాడు కదా!"

"ఓసారేం జరిగిందో తెలుసా?"

తెలియదన్నట్టుగా తల అడ్డంగా వూపాడు పోస్ట్‌మాన్.

అన్నయ్య చేత క్షవరం చేయించుకుని వెళ్ళిన వాళ్ళందరి దగ్గరా విస్కీ కంపు కొట్టసాగింది. ఈ విషయాన్ని గమనించిన ఓ పోలీసు తిన్నగా మా షాపుకి వచ్చాడు. లోపలి గదిలో విస్కీ సీసా చూశాడు. లైసెన్స్ లేకుండా బార్ నడుపుతున్నందుకు అన్నయ్యను అరెస్ట్ చేస్తానన్నాడు. వాడికి నర్ది చెప్పడానికి తల ప్రాణాం తోకకొచ్చింది. వాళ్ళందరికీ విస్కీ పొయ్యలేదనీ అన్నయ్య తాగిన విస్కీ వాసన పీల్చినందువల్ల వాళ్ళందరి దగ్గరా విస్కీ వాసన వచ్చిందనీ నచ్చజెప్పాం. పది డాలర్లిస్తే గాని మా మాటలు నమ్మలేదతను" అంటూ పెద్దగా

**అన్నయ్య చేత క్షవరం చేయించుకున్న వాళ్ళందరి దగ్గరా విస్కీ వాసన వచ్చేది.**

నవ్వేశాడు బార్బర్.

అప్పటికి గడ్డం చెయ్యడం సగమే పూర్తయ్యింది. కాబట్టి ఇంకోక కథ వినక తప్పదు- అనుకున్నాడు పోస్ట్‌మాన్.

పోస్ట్‌మాన్ అంచనా తప్పు కాలేదు.

"ఇంకోసారేం జరిగిందో తెలుసా?" ప్రశ్నించాడు బార్బర్.

"చెప్పకుండా ఎలా తెలుస్తుంది?" అడిగాడు పోస్ట్‌మాన్.

"అదీ పాయింటే... కంగారెందుకు? చెపుతాను గదా!" అంటూ ప్రారంభించాడు బార్బర్.

"ఓ శవానికి గడ్డం చెయ్యాలని కబురొచ్చింది జేమ్స్‌స్ట్రీట్‌లో 10వ నెంబర్ ఇంటి నుంచి. శవాలకు క్షవరాలేమిటని ఆశ్చర్యపడకు. జబ్బుగా వున్నప్పుడు గడ్డం పెంచుతారు గదా! చనిపోయిన వ్యక్తి మొహం ప్రశాంతంగా కనిపించాలని క్షవరం చేయిస్తారు."

"నేను వెళ్ళే సరికి ముందు గదిలో ఓ ముసలాయన కూర్చుని వున్నాడు. ఆయన పైన గదిలో వున్నాడు వెళ్ళి క్షవరం చెయ్యండి" అని చెప్పాడు. పది డాలర్లవుతుందన్నాను. ముసలాయన లోపలికి వెళ్ళి పది డాలర్లు తెచ్చి ఇచ్చాడు.

## పొద్దున్నే షాపుకి వచ్చేటప్పుడే తాగి వచ్చేవాడు.

పైకి వెళ్ళాను. మంచం మీద ప్రశాంతంగా నిద్రపోతున్నాడు ఓ యాభయ్యేళ్ళ వృద్ధుడు. గడ్డం చెయ్యడం ప్రారంభించాను. పోయి గంట కూడా కాలేదనుకుంటాను. అతని శరీరం ఇంకా వెచ్చగానే వుంది.



పది నిమిషాల్లో పని పూర్తి చేసి తిరిగి షాపుకి వచ్చేశాను.

మర్నాడో విచిత్రమైన విషయం తెలిసింది.

సస్పెన్స్ మెయింటేయిన్ చెయ్యడానికో దేనికో ఒక్క క్షణం ఆగాడు బార్బర్. తిరిగి చెప్ప సాగాడు.

"అదే వీధిలో ఒక ఇంట్లోంచి డాక్టర్‌కి, పక్క ఇంట్లోంచి బార్బర్‌కీ కబురెళ్ళింది. పొరపాటున నేను వెళ్ళాల్సిన ఇంటికి డాక్టరు, డాక్టర్ వెళ్ళాల్సిన ఇంటికి నేను వెళ్ళాం. నేను క్షవరం చేసిన తను విషం తాగాడు. అందువల్ల డాక్టర్ రావాలి. బదులుగా నేను వెళ్ళి క్షవరం చేశాను. డాక్టర్ రాని కారణంగా అతను చచ్చాడు."

బార్బర్ మాటలకు అడ్డ వస్తూ అడిగాడు పోస్ట్‌మాన్.

"చెపుతా చెపుతా! పక్కింట్లో అంటే డాక్టర్ వెళ్ళిన ఇంట్లో వ్యక్తికి కూడా చాలాకాలంగా అనారోగ్యంగా వుంది. చాలామంది డాక్టర్లు వైద్యం చేశారు. ఈ డాక్టర్ వెళ్ళి అతను విషం తాగాడనుకుని ఓ రబ్బరు గొట్టంతో అతని కడుపులోని కశ్మలాన్నంతా లాగేశాడు. దాంతో పాటు ఇతర డాక్టర్లిచ్చిన మందులన్నీ బయటికొచ్చేశాయి. ఆ దెబ్బతో అతని ఆరోగ్యం బాగైపోయింది" అంటూ పెద్దగా నవ్వేశాడు బార్బర్.

పోస్ట్‌మాన్ గడ్డం తెగింది.

తాపీగా ప్లాస్టర్ అంటించాడు బార్బర్. ●